క్లుప్తంగా

పాఠశాల పరిశీలన


ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ కృష్ణారావు

పాలకొండ రూరల్: ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థుకు మెరుగైన బోధన అందించాలని ఎంఈఓ పి.కృష్ణారావు అన్నారు. మండలంలోని తుమరాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నిర్వహణ, పరిశరాల పరిశుభ్రతపై ఆరాతీశారు. విద్యా ప్రమాణాలు తెలుసుకునేందుకు విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, విద్యార్థుల ప్రగతిని వారి తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని హెచ్ఎం, ఉపాధ్యాయులకు సూచించారు.

రేపు 'జగనన్నకి చెబుదాం'

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో ఈనెల 3న జగనన్నకి చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.గీతాంజలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో తెలియజేయాలని కోరారు.

వేగవంతంగా మౌలిక వసతుల కల్పన

● ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: జగనన్న ఇళ్ల లే అవుట్‌ల వద్ద నిర్మాణాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ పీఓ, సాలూరు నియోజకవర్గ హౌసింగ్ ప్రత్యేకాధికారి విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని నెలిపర్తి వద్ద గల జగనన్న పట్టణ గృహ లేఅవుట్‌ను పరిశీలించారు. లే అవుట్ వద్ద అప్రోచ్‌రోడ్డు నిర్మాణం,నీటి సదుపాయం కోసం బోర్‌వెల్ పనులు తక్షణమే ప్రారంభించాలని, ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ జయరాం, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

మార్గదర్శకాలను పాటించాలి

పార్వతీపురంటౌన్: టీకా కార్యక్రమంలో నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్ మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని పుట్టూరు, పెద బొండపల్లి, చినబొండపల్లి గ్రామాల్లో వైద్యసిబ్బంది నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఎంత మంది చిన్నారులు, గర్భిణులకు టీకా వేస్తున్నదీ, ఆర్‌సీహెచ్ రిజిస్టర్స్, టీకా అర్హుల జాబితాను పరిశీలించారు. టీకా కార్డులో గడువు తేదీలను తనిఖీ చేశారు. టీకా వేయడానికి ముందురోజు తెలియజేస్తున్నారా? అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్లలోపు పిల్లల టీకా వివరాల సమాచారం పూర్తిస్థాయిలో యూవిన్, ఆర్‌సీహెచ్ పోర్టల్స్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నవజాత శిశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, ఏఎన్ఎం నాగలక్ష్మి తదితరులున్నారు.

8,9 తేదీల్లో రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ పర్యటన

పార్వతీపురంటౌన్: అటల్ టింకరింగ్ ల్యాబ్ పథకం ద్వారా పాఠశాలలకు కేటాయించిన నిధులు, పరికరాల పరిశీలనకు ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్సు కమిటీ ఈనెల 8,9 తేదీల్లో పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించనున్నట్లు డీఈఓ ఎస్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అటల్ టింకరింగ్ పథకం ద్వారా నిధులు, విలువైన త్రీడీ ప్రింటర్, ఇంజినీరింగ్ పరికరాలు కేటాయించారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న నిధులు ఎంతవరకు వినియోగంలోకి వస్తున్నాయి? విద్యార్థులను ఎలా తీర్చిదిద్దుతున్నారు? తదితర అంశాలు, రికార్డుల నిర్వహణ, ప్రయోగశాలల అమలు తీరును పరిశీలించడానికి సమగ్ర శిక్ష, ఎస్‌సీఈఆర్‌టీ, కొంతమంది డీఎస్‌ఓలతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీని పాఠశాల విద్యాకమిషనర్ వేశారని, ఈ మేరకు వారు జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు.

పింఛన్ కానుకతో ఆర్థిక భరోసా

పాలకొండ రూరల్: ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్లతో లబ్ధిదారులకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. మండలంలోని అర్థలి గ్రామంలో లబ్ధిదారులకు బుధవారం పింఛన్ డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు జనవరి నెల నుంచి పింఛన్‌ను రూ.3 వేలు చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని 32 పంచాయతీల్లో 7,175 మంది లబ్ధిదారులకు గాను తొలిరోజు 4,988 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని 20 వార్డుల పరిధిలో 3,376 మంది లబ్ధిదారు ఉండగా 91 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తయిందని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు.

● భామిని: మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ శరవేగంగా సాగింది. వలంటీర్లు బుధవారం తెల్లవారు జామునుంచే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసి పింఛన్ డబ్బులు అందజేశారు. మండలంలో 7149 మంది లబ్ధిదారులు ఉండగా.. తొలిరోజు 3904 మందికి పింఛన్లు అందజేసినట్లు ఎంపీడీఓ జి.చంద్రరావు తెలిపారు. 16 సచివాలయాల పరిధిలో 525 మంది వలంటీర్లు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి..

భామిని: మండలంలోని పెద్దదిమిలికి చెందిన వృద్ధుడు గొర్లె సాయిబు అనారోగ్యంతో శ్రీకాకుళం ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్నాడు. అతనికి పింఛన్ వస్తుండటంతో వలంటీర్ ఎల్.లోకేష్ బుధవారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు.


భామిని: శ్రీకాకుళం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు సాయిబుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ లోకేష్


పాలకొండ రూరల్: అర్థలిలో లబ్ధిదారుకు పంఛన్ డబ్బులు అందజేస్తున్న ఎంపీపీ బొమ్మాళి భాను


భామిని: నేరడి-బిలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉపేంద్ర

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

పాలకొండ రూరల్: అనుకోని అగ్నిప్రమాలు సంభవిస్తే వాటిని అధిగమించే క్రమంలో అనుసరించాల్సిన మెళకువలపై అవగాహన అవసరమని అగ్నిమాపక శాఖ అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. పాలకొండ పట్టణంలోని ఎలైట్ కళాశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక శాఖ వినియోగించే పరికరాల పనితీరును డెమో ద్వారా వివరించారు. ప్రమాదం జరిగినపుడు ఆందోళన చెందకుండా అప్రమత్తతతో వ్యవహరించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చన్నారు.

రాష్ట్రాభివృద్ధికి పునరంకింతం కావాలి


గుమ్మలక్ష్మీపురం: కేజీబీవీలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, ఎంఈఓ బి.చంద్రశేఖర్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం కేజీబీవీలో బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంలో వారు పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్టేట్ అచీవ్‌మెంట్ టెస్ట్(సీస్)కు సిద్ధమవుతున్న విద్యార్థులకు నిర్వహించిన ప్రాక్టీస్ టెస్ట్‌ను పరిశీలించారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం బి.భీముడు, ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీరంజని, ఉపాధ్యాయులు ఉన్నారు.

● భామిని: మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీడీఓ జి.చంద్రరావు, ఈఓపీఆర్డీ జి.కృష్ణారావు, ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు, ఎస్‌ఏ శిరీష, జేఏ సోమేశ్వరరావు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని గుర్తుచేసుకున్నారు.


భామిని: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మండల పరిషత్ సిబ్బంది

భామినిని కరువు మండలంగా ప్రకటించాలి

భామిని: మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో నీరులేక ఎండిపోతున్న పంటలను రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో మండల కమిటీ బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ.. భామిని మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో 9వేల ఎకరాల్లో వరి పంట, 5వేల ఎకరాల్లో ప్రత్తి పంట ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మండల కమిటీ అధ్యక్షుడు లక్ష్మీపతినాయుడు, బిడ్డిక ప్రసాదరావు, లోపింటి అప్పారావు, సాసుపల్లి ఉదయబాబు, కొవ్వాడ మన్మథరావు, తదితరులున్నారు.


ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

పకడ్బందీగా సోషల్ ఆడిట్

సీతంపేట: స్థానిక ఉపాధిహామీ పథకం కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, సర్పంచ్‌లతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బి.ఆదినారాయణ మాట్లాడుతూ.. త్వరలో 15వ విడత సోషల్ ఆడిట్ నిర్వహించనున్నందున రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు. పకడ్బందీగా సోషల్ ఆడిట్ నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో పనులు పారదర్శకంగా జరిగాయా లేదా అనేది పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, ఉపాధిహామీ ఏపీఓలు బాబురావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ పరిధి జుంబిరి, నాయుడుగూడ, పెద్దగూడ గిరిజన గ్రామాలకు బీటీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు గురువారం శంకుస్థాపన చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఎస్ఈఏఎస్ ప్రాక్టీస్ పరీక్షతో మేలు


నారాయణపురంలో విద్యార్థుల ప్రాక్టీస్ పేపర్లను పరిశీలిస్తున్న ఎంఈఓ, ఎంపీడీఓ

బలిజిపేట: ఈ నెల 3వ తేదీన మండలంలోని 19పాఠశాలల్లో నిర్వహించనున్న ఎస్ఈఏఎస్ పరీక్షకు సంబంధించి ఆయా పాఠశాల్లో బుధవారం ప్రాక్టీస్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సామల సింహాచలం, ఎంపీడీఓ విజయలక్ష్మి పాఠశాలలకు వెళ్లి ప్రాక్టీస్ పరీక్షలను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడరతూ విద్యార్థులకు ఈ విధంగా పరీక్షలు నిర్వహించడం వల్ల తర్ఫీదు బాగా జరుగుతుందని ఎంఈఓ సామల సింహాచలం తెలిపారు. అసలైన పరీక్షలలో తడబాటు లేకుండా బాగా పరీక్షలు రాసే అవకాశాలున్నాయని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించిందీ? లేనిదీ? ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. 3వ తేదీన 19పాఠశాలల్లో మూడు, ఆరు, తొమ్మిదవ తరగతులకు చెందిన సుమారు 700మందికి పైగా విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అవసరం

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. అగ్నిప్రమాదాల నివారణపై పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద బుధవారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, షార్ట్‌సర్క్యూట్ తదితర కారణాలతో ఏ విధంగా అగ్నిప్రమాదాలు సంభవిస్తాయో? వాటిని ఎలా నివారించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది సింహాచలం, సీతంనాయుడు, సీతారాం, నాగరాజు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలు ఆరోగ్యానికి మేలు

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ విధానంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం పి.షణ్ముఖరావు అన్నారు. మండలంలోని రాయగడ జమ్ము, దుడ్డుఖల్లు గ్రామాల్లోని పాఠశాలల్లో కిచెన్ గార్డెన్‌లో సాగుచేస్తున్న కూరగాయ పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. రసాయన ఎరువులతో సాగు చేసిన పంటలను తినడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎం మోడల్‌లో సంవత్సరం పొడవునా కూరగాయ పంటలను సాగుచేయవచ్చన్నారు. సేంద్రియ విధానంలో సాగు చేసిన పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ఎంటీలు జి.స్వామినాయుడు, గోరిశెట్టి నిర్మలాదేవి, ఎల్.నరసింహ, ఏటీఎం మోడల్ మండల ఇన్‌ఛార్జ్ గణేష్ చంద్ర, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది రామారావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


రాయగడజమ్ము పాఠశాల విద్యార్థులకు ప్రకృతి సాగు విధానంలో కూరగాయల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

ఆలయాల అభివృద్ధికి సీజీఎఫ్ నిధులు

గరుగుబిల్లి: దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని దేవాదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్(రాజమహేంద్రవరం) ఎంవీ సురేష్‌బాబు అన్నారు. తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని బుధవారం ఆయన సందర్శించారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను ఈఓ వీవీ సూర్యనారాయణ ఆయనకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి దేవాదాయశాఖ సీజీఎఫ్ నిధులను మంజూరు చేస్తోందన్నారు. ఆ నిధులతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఈఓకు సూచించారు.


స్వామివారిని దర్శించుకుంటున్న సంయుక్త కమిషనర్ సురేష్ బాబు

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

గరుగుబిల్లి: గ్రామాలల్లో రైతులు, ప్రజలకు ఉపయోగపడే పనులు గుర్తించి ప్రణాళికలు తయారు చేయాలని ఉపాధిహామీ పథకం ఏపీడీ జి.శ్రీహరి సిబ్బందిని ఆదేశించారు. ఉపాధిహామీ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టాల్సిన పనులను గుర్తించాలన్నారు. ప్రతీ మండలానికి రూ.20 కోట్లు పైబడి పనులు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. రికార్డుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. పని కల్పించాలని కోరిన వేతనదారులకు తక్షణమే ఉపాధి కల్పించాలన్నారు. పనులు చేసేవారికి సకాలంలో వేతనాలు చెల్లింపు జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ పైడితల్లి, ఏపీఓ గౌరీనాథ్ ఉన్నారు.


మాట్లాడుతున్న ఏపీడీ శ్రీహరి

ప్రకృతి వ్యవసాయంపై వర్క్‌షాప్

గరుగుబిల్లి: తోటపల్లిలోని జట్టు కార్యాలయంలో ట్రస్టీ డి.పారినాయుడు అధ్యక్షతన 'ప్రకృతి వ్యవసాయం, పర్యావరణం' అంశంపై ఒక రోజు వర్క్‌షాపును బుధవారం నిర్వహించారు. పంచభూతాల పరిచయం, కాలాలు, వ్యవసాయ పనులు, పప్పుధాన్యాల సాగు, ఆహారపు గొలుసు, వ్యవసాయం-జంతువులు తదితర అంశాలపై రచయితలు టి.శివాజీ, టి.సత్యవతి, బి.భీమేశ్వరరావు, నారంశెట్టి ఉమామహేశ్వరరావు, బీవీ పట్నాయిక్, ఎ.కైలాశరావు తదితరులు చర్చించారు. ఆయా అంశాలపై రచనలు చేసేందుకు నిర్ణయించారు. అంతకు ముందు అమరజీవి పొట్టు శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.


వర్క్‌షాపులో పాల్గొన్న రచయితలు

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

గరుగుబిల్లి: జగనన్న కాలనీల్లో ఇళ్ల లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని పెద్దూరు గ్రామంలో జగనన్న కాలనీలో బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో బోరుబావిని తీయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో రహదారులు, విద్యుత్ సౌకర్యం, సీసీ కాలువలు ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గృహాలు నిర్మించుకునేవారికి ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు, మర్రాపు శ్రీనివారావు, తిరుపతిరావు తదితరులున్నారు.


బోరుబావి ఏర్పాటును పర్యవేక్షిస్తున్న అధికారులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పాలకొండ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిగత ఆరోగ్య భద్రతపై దృష్టి పెట్టాలని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పైల శంకరరావు అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ నేతృత్వంలో బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించారు. వైద్య సిబ్బంది రామారావు, రామశేషు విద్యార్థులకు వివిధ వైద్య పరీక్షలు చేసి తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి వెలమల అప్పారావు, ఫిజికల్ డైరెక్టర్ నాగభూషణరావు, సహాధ్యాపకులు వెంకటేశ్వరరావు, నారాయణరావు తదితరులున్నారు.


విద్యార్థులుక వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఎస్సీ, ఎస్టీ కేసులు సత్వరం పరిష్కరించాలి

పాలకొండ: ఎస్సీ, ఎస్టీ కేసులు సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ చైర్మన్, ఆర్డీఓ ఎం.లావణ్య సూచించారు. ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కేసుల పురోగతిపై ఆర్డీఓ సమీక్షించారు. కేసులు ప్రస్తుత పరిస్థితిని తెలుసుకుని పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సమావేశంలో డీఎస్పీ కృష్ణారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ లావణ్య


గుమ్మలక్ష్మీపురం: కొండవాడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కృష్ణారావు


సీతంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పేదల ఆరోగ్య భద్రతకు భరోసా..

పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. నిపుణులైన వైద్యులను గ్రామాలకు పంపించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా బుధవారం సీతంపేట మండల కేంద్రంలో, గుమ్మలక్ష్మీపురం మండలం కొండవాడలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. వైద్యులు రోగులకు తనిఖీలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వైద్యశిబిరాలను పరిశీలించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు.

- సీతంపేట, గుమ్మలక్ష్మీపురం


సీతంపేట: జేఏఎస్ శిబిరంలో హెల్త్ రిపోర్టులను అందజేస్తున్న ఎంపీడీఓ గీతాంజలి, వైద్యసిబ్బంది